రోజా సాయంకాలం అయ్యాక షాపింగ్ ముగించుకుని, ముఖ్యమైన స్నేహితులను విధిగా కలుసుకుని, అక్కడ ఓ పార్టీతోనో, పిక్చర్‌తోనో, డిన్నర్‌తోనో ఆ సాయంకాలాన్ని ఓ ఆహ్లాదకరమైన సాయంకాలంగా మార్చేసి, తిరిగి ఉదయం కాగానే మళ్ళీ షాపులకి బయల్దేరడం—

ఇలా మూడు రోజులు గడిచాయి.

ఈ రోజు తప్పనిసరిగా ఓల్డ్ సిటీకి వెళ్ళాలి... అక్కడ లాట్ బజార్‌లో ఏంటిక్‌ని, వాటి నమూనాలు అందమైనవి వుంటే ఖరీదు చేయాలి...

అందుకని వాళ్ళిద్దరూ సిటీ బస్ ఎక్కారు. అది మెయిన్ రూట్లలో మున్న వెడల్పాటి రోడ్ల మీంచి వేగంగా పరుగులు తీస్తుంది. వాళ్ళిద్దరూ పక్క పక్కనే కూచొని విండోలోంచి బయటికి చూస్తున్నారు. ఇరుపక్కలా లేచిన ఎన్నో గొప్ప కట్టడాలు వాళ్ళ కనుపాపల్లో కదలాడి వెనక్కి జరిగిపోతూ కనుమరుగౌతున్నాయి.

శశిబాల తాను సంచరిస్తున్నంత మేరా పాత జ్ఞాపకాలతో ఉక్కిరి బిక్కిరి అవుతోంది. తానక్కడ సిటీ బస్సుల్లో వెళ్తూ యూనివర్సిటీలో చదువుకుంటూ గడిపే రోజులు గుర్తొస్తాయి.

ఆ కవ్వించే కళ్ళూ...చిరునవ్వులు చిందించే ఆ ముఖాలూ ఆమె స్మృతి పథంలో యింకా నిన్న మొన్నటివిలానే ఫ్రెష్‌గా కదుల్తూనే వున్నాయి. ఇంకా తనని పలకరిస్తున్నట్టే వున్నాయి.

వాళ్ళిప్పుడు ఎక్కడున్నారో...

ఏ ఉద్యోగం చేస్తూ ఏ ఊళ్ళో ఏ భార్యా బిడ్డల్తో ఏ జీవితాన్ని ఎలా గడుపుతున్నారో...

శశిబాల కిరణ్ పక్కనే కూచుని ఇంకా ఇలాంటివే ఏవేవో ఆలోచనలు సాగిస్తోంది. ఇంతలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి టిక్కెట్లు చూపమని డిమాండ్ చేశాడు.

కిరణ్‌కుమార్ తాను తీసుకున్న టిక్కెట్లు ఇచ్చాడు.

శశిబాల ఆ వచ్చినతనికేసి చూసింది. అతను టిక్కెట్లు చెక్ చేసి వాటిని మళ్ళీ కిరణ్ కుమార్ కిచ్చేశాడు.

శశిబాల ఈసారి మరింత ప్రత్యేకించి అతనికేసి చూసింది. ఇతన్ని ఎక్కడో చూసినట్టున్నానే అని అనుమానంగా అనుకుంది. కాని ఎక్కడ చూసినట్టు అతన్ని...

గుర్తు కొస్తోంది—

ఔను! అతనే...తాను యూనివర్సిటీకి వెళ్ళే రోజుల్లో రోజూ తానెక్కే సిటీ బస్‌లో అతనే కండక్టరుగా వస్తూండే వాడు.

కాని శశిబాల తన కళ్ళను తానే నమ్మలేకుండా వుంది.

అతనిప్పుడు అతనిలా లేదు.

అతను కేవలం ఓ కండక్టరు మాత్రమే... కాని అందగాడు—

చలాకీతనం, చిలిపితనం అతని సొత్తులా వుండేవాడు. కళ్ళల్లో కొంచెం కైపూ, మరికొంచెం కవ్వింపూ వుండేవి. శరీరపు మెరుపో, యవ్వనపు సొంపో...మొత్తానికి ఎదుటి వారి చూపుల్ని శాసించేవి.

అలాంటి అతనేనా ఇతను—

అతనిప్పుడు అతను కాదు.

ఆ ముఖంలో ముక్కూ, నోరూ, కళ్ళూ, చెవులూ మినహా మరేమీ మిగలని దిగంబర ముఖం—

జుట్టు కాస్త నెరిసింది. పళ్ళు కాస్త వలిగింది.

ముమ్మాటికీ అతనిప్పుడు అతను కాదు.

అందం ఉడిగిన దిగంబర ముఖాన్ని ఆమె చూస్తోంది.

ఆమె మనసు చివుక్కుమంది.

అందం పట్ల "ఓహో" అనటానికీ, అది వాడి వత్తలైతే "అయ్యో" అనడానికీ ఆ అందం వాళ్ళ సొంతమే కానక్కరలేదు.

ఆమె తన చేతిలోకి కిరణ్ చేతిని తీసుకుని మరింత బలంగా అదిమి పట్టుకుంది.

కిరణ్ పక్కనే శశిబాల కూచున్నా అతను మాత్రం తన నర్సింగ్ హోమ్ గురించే తదేకంగా ఆలోచిస్తున్నాడు. అతనిన్నాళ్ళూ తన క్లినిక్‌ని మరచి ఎక్కడా వుండలేదు. అందుకని అతనికి బెంగగా వుంది. అతనీ నగరంలో ఒకప్పటి తన మెడికోస్ ఈనాడెలా తమ సొంత ప్రాక్టీసుల్లో డబ్బును చేతుల్లో పండించి దోసిళ్ళలోకి ఎత్తుకుంటున్నారో కళ్ళారా చూసే సరికి అతని బెంగ మరింత పెరిగింది.

ఓ డాక్టరు గొప్పతనాన్ని కొలిచే గొప్ప సాధనం అతనెన్ని వేలు ప్రజల మీద గడించాడన్నదే—

ఆ డబ్బు సంపాదించడానికి ఇక్కడ ఎన్నెన్ని మార్గాలున్నాయో, అవి ఎంత సులభ తరమో చూసి చకితుడయ్యాడు. అవన్నీ ఇప్పుడు అతన్ని ఉత్తేజితుణ్ణి చేస్తున్నాయి.

అందుకని అతనికి తన క్లినిక్ మీద బెంగ తిరిగింది.

## ● తుమ్మల్లో పొద్దుగూకుతున్న సీమ

రత్నాల్లో
లేక రాళ్ళు బోసి
రాళ్లని కాలిచారో
అబ్బబ్బ పేరు గొప్ప
సీమ దిబ్బ —
ఔనిక్కడ
ఉన్నవేగాని
లేనివేవీ లేవ్—

ఆవురావురని
అరిచే
ప్రేగులున్నాయ్ —
దిగులు
దీపాలెత్తిన
కనుపాపలున్నాయ్ —
చింతకొమ్మల్లో
ఎంగిలి మెతుకుల కోసం
ఎదురు చూసే కాకులున్నాయ్-
దారుల్ని మొరిగి
దొంగల్ని నాకే
కుక్కలున్నాయ్ —
బొమికల్ని తీరుబడిగా
నేలాడదీసుకొన్న

ముసలి పసరాలున్నాయ్ —
నెత్తిన
పుచ్చిన వాసాల్ని ముడివేసుకున్న
కొంపలున్నాయ్ —

నడిచే
జీవచ్ఛవాల మీద జీరాడే
చొక్కా పీలికలున్నాయ్ —
ఏటా ఇనుకే నీరై పారే
రెట్టలావు వాగులున్నాయ్ —
ఆపై కొసమెరుపుగా
పచ్చి మిరపకాయలాంటి
కచ్చా రాజకీయాలున్నాయ్ —

హన్నా .......
అరచొట్టు నీటికి
ఆసాంతం మొఖం వాచి
ఎండల్లో
బండల్ని పగలగొట్టుకొని
మొండి చేతుల్తో పైకొచ్చే
మూల్గుతున్న
బొంత జెముళ్లున్నాయ్

హా చ్చా చ్చా ......

అలచంద్రైనా
మొలకెత్తని
చవిటి చ్ఛర ఇది —
నానకోయిల్లు
పలకని
చోటు ఇది —
చలిచీమలు
తిరగని
నేల ఇది —
ఏరువాక
ఎరగని
ధరణి ఇది —
ఎండిన బీళ్లకు
సోళ్ళొచ్చి
అరుస్తున్న గడ్డ ఇది-
హన్నా!
ఇంకేం కొదవుంది?
రాయలంతటి
మహానుభావుడేలిన
రతనాల సీమ ఇది!

- వేంపల్లి అబ్దుల్ ఖాదర్

